ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి 8
ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి 8



రేషన్ కార్డులకు గ్రీన్ సిగ్నల్

- అక్టోబరు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- డిజిటల్ కార్డుల పంపిణీకి కసరత్తు
- ఆరేళ్లకు మళ్లీ ప్రక్రియ
- ఇప్పటికే జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు
- జిల్లాలో 4.97 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు
- ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

డిజిటల్ రేషన్‌కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటితోపాటు కొత్తవి అందించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రేషన్ కార్డుల కోసం జిల్లాలో ఆరేళ్లగా ఎదురు చూస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ప్రస్తుత ప్రభుత్వ వరకు రేషన్ కార్డులపై ప్రకటనలు చేసిన ప్రతీసారి జిల్లాలో పెండింగ్ దరఖాస్తుదారులు, కొత్తగా అర్హత ఉన్నవారు ఆశగా ఎదురుచూడడం, నోటిఫికేషన్ రాకపోవడంతో నిరాశ చెందడం మామూలుగా మారిపోయింది. మరోవైపు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటోంది. దీంతో వివిధ పథకాలను కోల్పోయే పరిస్థితి వచ్చింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలపై దరఖాస్తులు తీసుకున్నా రేషన్ కార్డు కాలం లేకపోవడంతో తెల్లకాగితంపై దరఖాస్తులు స్వీకరించారు. కార్డులపై అయోమయం నెలకొన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ కార్డుల జారీకి విధి విధానాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. దీంతో దాదాపు ఆరేళ్లగా ఎదురు చూస్తున్న కుటుంబాల నిరీక్షణ తొలుగుతుందని భావిస్తున్నారు. రేషన్ కార్డుల విధి విధా నాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై కూడా ఆసక్తి నెలకొంది. కొత్తగా జారీ చేసే కార్డులతోపాటు పాత వాటి స్థానంలో డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. డిజిటల్ రేషన్ కార్డులు, డిజిటల్ కార్డు ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా మారనుంది. రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మీ వంటి సంక్షేమ పథకాలు పొందడానికి కూడా వీలు ఉంటుంది. రేషన్ అవసరం లేనివారికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డులు విడివిడిగా అందించడానికి నిర్ణయించినట్లు తెలుస్తుంది. నిబంధనలు ఎలా ఉన్నా ఆదాయ పరిమితి ఎంత వరకు విధించే అవకాశం ఉంటుందన్నదానిపై సందిగ్ధం నెలకొంది.

చేర్పులు, మార్పులకు తప్పని ఎదురు చూపులు

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం 20,606 మంది దరఖాస్తు చేసుకు న్నారు. నిత్యం రేషన్ కార్డులు వస్తున్నా యని చేర్పులు, మార్పులకు అవకాశం ఇచ్చారనే ప్రకటనలతో అయోమయానికి గురవుతున్న వారికి ఈ సారైనా అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు. ఇందులో కొంత మేరకు పరిశీలన జరిగినా మార్పులు మాత్రం చేపట లేదు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 1321, చందుర్తి 1760, గంభీరావుపేట 2125, ఇల్లంతకుంట 1760, కోనరావుపేట 1403, ముస్తాబాద్ 1914, రుద్రంగి 948, సిరిసిల్ల 2689, తంగళ్లపల్లి 1333, వీర్నపల్లి 481, వేములవాడ రూరల్ 1105, వేములవాడ 2105, ఎల్లారెడ్డిపేటలో 2032 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు రాకపోగా కనీసం ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చలేదు. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వీటితోపాటు గతంలోనే రేషన్ కార్డు కోసం 40 వేల మంది వరకు అర్హులు దరఖాస్తులు చేసుకున్నారు. 2018 సంవత్సరానికి ముందు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 2021 ఆగస్టులో 2271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత కనీసం మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా అందించలేకపోయారు. డిసెం బరులో వచ్చే కార్డుల్లోనైనా చేర్పులు, మార్పులకు మోక్షం కలుగుతుందని భావిస్తున్నారు.

• జిల్లాలో 40 వేల దరఖాస్తులు పెండింగ్

జిల్లాలో ఆరు గ్యారంటీలతోపాటు రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు, గతంలో దరఖాస్తులు కలిపితే దాదాపు 40 వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరు గ్యారంటీల్లో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోయినా విడిగా దరఖాస్తులను స్వీకరించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో అమ్మహస్తం పథకం కింద రూ.185కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. బియ్యంతోపాటు కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి,కారంపొడి, నూనె వంటి సరుకులు పంపిణీ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్చి కేవలం బియ్యానికే పరిమితం చేశారు. అంతేకాకుండా రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో ఆరోగ్య సమస్య వస్తే కలెక్టరేట్‌లో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ఇలా అనేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయించినా పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ మొదలు కాలేదు. తాజాగా మళ్లీ సబ్ కమిటీ వేసి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించడంతో జిల్లాలో అర్హులైన దరఖాస్తు దారుల్లో ఆశలు మొదలయ్యాయి. జిల్లాలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో 1.92 లక్షలు వివిధ ఆప్షన్లలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 40 వేల మంది వరకు రేషన్ కార్డులు, చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు ఇచ్చారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను రేషన్ కార్డులు లేకపోవడంతో అందుకోలేకపోయారు. రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకే సంక్షేమ పథకాలు అందిన నేపథ్యంలో తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేకమంది డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు అందుకోలేకపోయారు. మరోవైపు వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందే సమయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

• జిల్లాలో 1.73 లక్షల రేషన్ కార్డులు

జిల్లాలో ప్రస్తుతం లక్షా 73 వేల 745 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,59,854, అంత్యోదయ కార్డులు 13,684, అన్నపూర్ణ కార్డులు 207ఉన్నాయి. కార్డుల పరిధిలో 4 లక్షల 97 వేల 103 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో అంత్యోదయ కార్డుల్లో 36,526 మంది, ఆహార భద్రత కార్డుల్లో 4,60,367, అన్నపూర్ణ కార్డుల్లో 210 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 32,43,212 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23: రహీంఖాన్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన పనిచేయడానికి అర్హుల నుంచి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు-1, పీజీటీ ఇంగ్లీష్- 2, పీజీటీ కామర్స్- 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్‌జెక్టుల్లో పీజీతోపాటు బీఈడీ ఉండాలని తెలిపారు. ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని 25న పాఠశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

చెరువు పరిసరాల్లో తొలగిన చెత్తాచెదారం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింది. దారి పక్కన చెత్త వేయడంతో పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 23న 'డంపింగ్ యార్డును తలపిస్తున్న చెరువు పరిసరాలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో సత్తయ్య సోమవారం స్పందించారు. పరిసరాలను పరిశీలించి చెత్తను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. చెత్తా తొలగడంపై సమస్య తీరిందని రైతులు పేర్కొంటున్నారు.

కుసుమ రామయ్య పాఠశాలకు ప్రశంసాపత్రం



ప్రశంస పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 23: ఇన్‌స్పైర్ మానిక్ జాతీయ స్థాయి పోటీలకు సిరిసిల్ల కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జక్కని హేమంత్, గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్ రూపొందించిన మరమగ్గాల క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ఎగ్జిబిట్ మన్ననలు పొందింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం పాఠశాలను ప్రశంసిస్తూ సర్టిఫికెట్ అందించింది. సోమవారం ఆ ప్రశంస పత్రాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు శంకర్‌గౌడ్, లకావత్‌మోతీలాల్‌కు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు గోవిందరావు, పాతూరి మహేందర్‌రెడ్డి, కుమ్మరి మల్లేశం, దేవతా ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంకేత భాషపై అవగాహన

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 23: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ సంకేత భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సంకేత భాషపై డాక్టర్ మోహన్‌కృష్ణ, డాక్టర్ సంపత్‌కుమార్‌లు అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి వసంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు చెవిటి వారు ముఖ కదలికల ద్వారా వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎన్‌జీవో ప్రతినిధులు సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్

వేములవాడ, సెప్టెంబరు 23 : జీవనోపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి అనారోగ్యానికి గురై స్వదేశానికి తిరిగి వచ్చిన సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ అనే యువకుడు సోమవారం వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలల క్రితం సౌదీ అరేబియా వెళ్లి సూపర్ మార్కెట్‌లో పనిలో చేరిన ఇమ్రాన్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యుల సలహా మేరకు ఫైల్స్ చికిత్స కోసం ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ అనంతరం ఆరోగ్యం కుదుటపడకపోవడంతో తాను స్వదేశం వెళ్తానని యజమానిని కోరాడు. అందుకు ఒప్పుకోకపోవడంతోపాటు తనను చంపేస్తానని బెదిరిస్తున్నారంటూ ఇమ్రాన్ పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రభుత్వం జోక్యం చేసుకొని తనను స్వదేశానికి రప్పించాలని ఇమ్రాన్ వేడుకుంటున్న వీడియోను చూసిన ఆది శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియాలోని అధికారులకు లేఖ రాశారు. దీంతో వారు స్పందించి ఇమ్రాన్ స్వదేశం రావడానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఈ నెల 18న ఇమ్రాన్ సిరిసిల్ల చేరుకున్నాడు. తాను సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఇమ్రాన్ సోమవారం వేములవాడలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు..



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఇమ్రాన్

మార్కెట్ కమిటీ పాలక వర్గాలకు సన్మానం



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ నూతన పాలక వర్గ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాచర్లబొప్పాపూర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు అధిష్టానం గుర్తింపు లభిస్తుందన్నారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, చిన్నలక్ష్మీ, రాజేందర్, నారాయణరెడ్డి, బాలయ్య, రవీందర్, కిష్టారెడ్డి, గణపతినాయక్, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి, వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి, డైరెక్టర్లకు కాంగ్రెస్ గ్రామ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు అంబేద్కర్, చాకలి ఐలమ్మ, మహాత్మాగాంధీ, విగ్రహాలకు పూల మాలలు వేశారు. అనంతరం హన్‌మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, నాయకులు ఎర్ర కిషన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, వేణుగోపాల్, మల్లేశం, సంతోష్, నాంపెల్లి, సత్తయ్య, హిమామ్, షానూర్, రాజయ్య, కాశయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకమైన లకావత్ రాములు నాయక్, డైరెక్టర్ నందగిరి శ్రీనివాస్‌ను రంగంపేట మాజీ ఎంపీటీసీ పంబాల రేణుక, మాజీ సర్పంచ్ నందగిరి లింగం ఆధ్వర్యంలో రంగంపేట గ్రామస్థులు సోమవారం సన్మానించారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట, సెప్టెంబరు 23: కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ సేవా సమితి దుబాయ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అభివృద్ధి పనులు చేపట్టాలని సమితి దుబాయ్ కన్వీనర్ ఎస్వీ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, నారాయణ, విజయ్, సుదర్శన్, రాజేష్, చంద్రు, రవి తదితరులు ఉన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఉద్యమకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 23 : రజకుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మడేలేశ్వర స్వామి ఆలయం సమీపంలో సోమవారం నాడు రజక సహకార సంఘం భవనానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 32 సంఘాలకు నిధులు మంజూరు చేసామని, సామాజిక భవనాలు సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగపడతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 10 కోట్ల నిధులను నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో అత్యవసరంగా ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించటం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రవీంద్ర భారతిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారని, కోఠిలోని ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టారని, చాకలి ఐలమ్మ మనుమరాలను బీసీ కమిషన్ మెంబర్ గా నియమించారని తెలిపారు. ఇది ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు దక్కిన గౌరవమని, గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు మొండి చెయ్యి చూపారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ ఏనాడు కూడా మహాత్మ జ్యోతిరావు బాపులే వర్ధంతికి, జయంతికి కనీసం పూలమాల వేయలేదని, ప్రజా ప్రభుత్వంలో మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోతున్నామని, ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర సమయంలో దేశవ్యాప్తంగా జనాభా, కులగనన జరగాల్సిందేనని అన్నారని, దానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలలో బీసీ కులగలన బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


రాజన్న ఆలయంలో భక్తుల సందడి



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 23 : వేములవాడ రాజన్నకు సోమవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పార్వతీపరమేశ్వరులను దర్శించుకొని తరలించారు. అనంతరం గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భీమేశ్వర, నగరేశ్వర, బద్దిపోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు తిరుపతిరావు, అశోక్, ఎడ్ల శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

●వరంగల్‌కు చెందిన ఓ భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనానికి వచ్చాడు. దీంతో క్యూలైన్‌లో నిల్చున్న భక్తుడు ఒక్కసారిగా కుప్పకూలాడు గమనించిన బంధువులు, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ఆలయ సిబ్బంది సహాయంతో సదరు భక్తుడిని ఆసుపత్రికి తరలించారు.



మరమ్మతులు కరువు

- ఫ్లోరింగ్ కుంగి.. గుంతలు పడ్డ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం
- మరమ్మతులు చేయాలని మహిళల వినతి


ఉపాధిహామీ భవనంలో కుంగిన ఫ్లోరింగ్


స్త్రీశక్తి భవనంలో లేచిన బండలు


సైదాపూర్ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం

సైదాపూర్, సెప్టెంబరు 18: సైదాపూర్ మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బందికి, ఉపాధిహామీ సిబ్బందికి కలిపి ఒకే చోట 2011వ సంవత్సరంలో భవనం నిర్మించారు. 2016 నవంబరు 26న అప్పటి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించి బిల్డింగ్‌ను ఉపాధిహామీ, ఐకేపీ అధికారులకు అప్పగించారు. కానీ ఆ భవణం సంవత్సరం గడువక ముందే ఫ్లోరింగ్ కుంగి బండలు లేచి గుంతలు ఏర్పడ్డాయి. గోడలు పగుళ్లు చూపాయి. పాములు తేళ్లు స్వైర విహారం చేస్తున్నాయి. అయినప్పటికి అప్పటి నుంచి ఆ బిల్డింగ్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు అధికారులు. మరమ్మతులు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక మహిళలు ప్రతి రోజు వచ్చే స్త్రీ శక్తి భవణం వద్ద సరైన మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారులు, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి స్త్రీశక్తి, ఉపాధిహామీ బిల్డింగ్ ఫ్లోరింగ్ మరమ్మతులు చేయాలని మహిళలు, ఉపాధిహామి, ఐకేపీ సిబ్బంది కోరుతున్నారు.

పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళలకు, ఉపాధిహామీ ద్వారా వారి సిబ్బందికి నిత్యం ఏదో ఒక సమావేశం జరుగుతూనే ఉంటుంది. ఈ భవణాలు ఎప్పుడు రద్దీగా కనిపిస్తాయి. అలాంటి భవణాల్లో ఫ్లోరింగ్ గుంగడంతో, బండలు లేవడంతో మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

● విష పురుగులు స్వైర విహారం

స్త్రీశక్తి, ఉపాధిహామీ రెండు భవణాల్లో ఫ్లోరింగ్ కుంగడం, గోడలు పగలడంతో పాములు, తేళ్ల వంటి విషపురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. ఒక రోజు ఏపీఎం టేబుల్ డ్రాలో పాము దూరింది. అటెండర్ టేబులు తూడిచేందుకు వెళ్లగా పాము బయటకు వచ్చిందని, దాంతో అటెండర్ బయపడి పరుగెత్తడంతో కింద పడిపోగా దెబ్బతగిలిందని సిబ్బంది తెలిపారు. అంతే గాక ఇంకొక రోజు దర్వాజపై పాము పడుకోవడంతో మహిళలు పామును చూసి పరుగులు తీశారని, వెంటనే కొందరు సిబ్బంది పామును చంపి వేశారని తెలిపారు. ఇంకో రోజు నీటి సంపులో పడి పాము చనిపోయిందన్నారు. ఈ కార్యాలయాలకు రావాలంటే భయం వేస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరమ్మతులు కరువు

లక్షలు వెచ్చించి భవణాలు నిర్మించారు కానీ మరమ్మతు చేయడానికి వెనుకాడుతున్నారని, చర్యలు తీసుకోవడం లేదని మహిళా సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఇక్కడకు రావాలంటే భయమేస్తుంది

- సమ్ము రజిత, సంతోషిమాత మండల సమైక్య అధ్యక్షురాలు, సైదాపూర్



స్త్రీ శక్తి భవనం ఫ్లోరింగ్ కుంగిపోవడం, ఫ్లోరింగ్ బండలు లేవడం, గోడలు పగుళ్లతో ఇక్కడికి రావాలంటేనే భయం వేస్తోంది. అంతేగాక పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. వెంటనే ఫ్లోరింగ్ మరమ్మతుతో పాటు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించాలి.

చెయ్యి విరగడంతో ఇబ్బంది పడుతున్నా

- వెంకటేష్, అటెండర్, ఐకేపీ సైదాపూర్



మాది పేద కుటుంబం. ఐకేపీలో అటెండర్‌గా పని చేస్తున్నా. చాలా సార్లు బండలు తట్టుకొని కింద పడ్డాను. చిన్న చిన్న దెబ్బలతో సర్దుకపోయాను. ఏపీఎం రూం వద్ద బండ తట్టుకొని పడడంతో చెయ్యి విరిగింది. విరిగిన చెయ్యితో ఇబ్బందిగా ఉంది. ఏ పని చేసుకోలేక పోతున్నా.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

ఎలిగేడు, సెప్టెంబరు 23: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన రంగు కొంరయ్య(51)అనే గీతకార్మికుడు సోమవారం సాయంత్రం తాటిచెట్టు పైనుంచి మోకు జారీ గాయాలపాలయ్యాడు. వృత్తిరీత్యా తాటికల్లు తీయడానికి కొంరయ్య చెట్టుపైకి వెళ్లాడు. దిగే క్రమంలో మోకుజారి కిందపడ్డాడు. దీనితో అతనికి కాలు, వెన్నుముకకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుప్రతికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహిళ అదృశ్యం

జ్యోతినగర్, సెప్టెంబర్ 23: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకే రామయ్య కాలనీకి చెందిన శ్యామల(35) అనే మహిళ కనిపించడం లేదు. కొన్ని నెలలుగా భర్త సంతోష్‌తో దూరంగా ఉంటున్న శ్యామల పీకే రామయ్య కాలనీలో ఉంటుంది. ఈ క్రమంలో భార్య శ్యామల వద్దకు భర్త సంతోష్ వచ్చి గొడవ చేశాడు. ఆ తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్యామల ఇంటికి తిరిగి రాలేదు. శ్యామల తండ్రి రాజకొమరయ్య తన కూతురు కనిపించడం లేదని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి, సెప్టెంబరు 23: చొప్పదండి పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమికి తప్పుడు నివేదికలను ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌లు సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌కు ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమి యథేచ్ఛగా కబ్జాకు గురవుతుందని డీఈ, ఈఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదదని ఆయన పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తప్పులు చేసే అధికారులపై చర్యలు చేపట్టి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు.



దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీవుల్లా ఖాద్రి అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ పదేళ్ల క్రితం అధికారంలోకి రాక ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. దేశంలో 16శాతం నిరుద్యోగం ఉన్నదని, చదువుకు తగ్గట్టు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అక్టోబరు 27, 28తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లింగం రవి, పంజాల శ్రీనివాస్, మానస్‌కుమార్, మార్కపురి సూర్య, కనకరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ వలీవుల్లా ఖాద్రి

మందుబాబులకు జరిమానా


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు

వేములవాడ, సెప్టెంబర్ 23 : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 71 మందికి వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ ఆర్.రాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా పట్టుబడిన 71 మందిని న్యాయమూర్తి జ్యోతిర్మయి ఎదుట ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి రూ. 3500 రూపాయల చొప్పున, 20 మందికి 2500 రూపాయల చొప్పున, మిగతా జరిమానా 51 మందికి 1500 రూపాయల చొప్పున జరిమానా విధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారికి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.


ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, సెప్టెంబర్ 23: చందుర్తి మండల కేంద్రంకు చెందిన ఓ యువకుడిని దూషించిన సంఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మర్రి రమేష్ అనే యువకుడు ఇంటి నిర్మాణం కోసం తీసుకు వచ్చిన ఇసుకతో పాటు ఇతర సామగ్రి ఆరుబయట నిల్వ చేశాడు.

ఈ క్రమంలో శనివారం రాత్రి పోతరాజు రవి అనే వ్యక్తి ఇసుక తొలగించాలని రమేష్‌ను దూషిస్తూ పాటు గొడ్డలి పట్టుకొని వెళ్లగా రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాబు తెలిపారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 23: గురుకుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను జిల్లా యూటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలోని 700లకు పైగా గురుకులాలు అద్దె భవనాలలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయని అన్నారు. అశాస్త్రీయమైన పాఠశాల పనివేళలు సవరించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల విద్యార్థుల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో టీఎస్ యుటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆశలవారీగా అందోళన కార్యక్రమాలు చేపడుతామని దీనిలో భాగంగా ఈనెల 28న హైదారాబాద్‌లో గురుకుల ఉపాధ్యాయులతో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు ముల్కల కుమార్, సెక్రటరీ జావీద్, నాయకులు భూపేందర్ కౌర్, తిరుపతి, స్వామి, శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.







బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

వీణవంక, సెప్టెంబర్ 23: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన జున్నుతుల మనోహర్‌రెడ్డి 2003లో టాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న జున్నుతుల రాజేశ్వర్‌రెడ్డి(9) అనే బాలుడికి గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా జున్నతుల శ్రీనివాస్‌రెడ్డి, జున్నుతుల రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, చదువు వీరారెడ్డిలకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరస్తుడిని కోర్టులో ప్రవేశపెట్టగా హుజూరాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జున్నుతుల మనోహర్‌రెడ్డికి 19 నెలల జైలు శిక్షతో పాటు 6,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ పంతంగి శ్రీనివాస్,ఎస్‌ఐ తోట తిరుపతి, జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్‌లను ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలి

శంకరపట్నం, సెప్టెంబరు 23: ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ హనుమకొండ కార్యాలయంలో శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇళ్ల పక్క నుంచే విద్యుత్ లైన్ వేయవద్దని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. పనులు వెంటనే నిలిపివేయాలని సీఎండీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కమర్షియల్ విద్యుత్ లైను ఊరు బయట నుంచి తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గంగాధర, సెప్టెంబరు 23: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర గ్రామానికి చెందిన మల్యాల రాజేందర్ తన వీవో 23 మొబైల్ ఈనెల 18 పోగొ ట్టుకున్నాడు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఐటీయూ సంఘర్షణ యాత్ర

వీణవంక, సెప్టెంబర్ 23: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియూ అధ్వర్యంలో సంఘర్షణ యాత్ర చేపట్టారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ న్యాయ సంహిత చట్టం 106 రద్దు చేయాలన్నారు. జీవన భృతి 4500 కల్పించాలని డీజిల్,పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు పుణ్ణం,చెలికాని శ్రీనివాస్,పిల్లి రవి యాదవ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



కప్‌ను అందుకుంటున్న విజేత మెదక్ బాలుర జట్టు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : రాజ మూడు రోజులపాటు నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. టోర్నీలో మెదక్(బాలుర), నిజామాబాద్ (బాలికల)జట్లు విజయం సాధించాయి. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్ 'నువ్వానేనా' అన్నట్లుగా జట్లు పోటీపడ్డాయి. ఫైనల్స్‌లో మెదక్, నిజామాబాద్ బాలుర జట్లు తలపడగా మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు తలపడగా నిజామాబాద్ జట్టు గెలిచాయి. శనివారం సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానం, బతుకమ్మ ఘాట్ సమీపంలోని మైదానంలో టోర్నీ ప్రారంభించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి 19 బాలికలు, 19 బాలుర జట్లు తలపడ్డాయి. విజేతలకు డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటల్లో రాణించాలన్నారు. సాఫ్ట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి అర్చన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్రనాయకుడు లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

చందుర్తి, సెప్టెంబరు 23 : చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి శివారులో 13ఏళ్ల బాలికను సోమవారం యువకుడు కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. బాలిక కుటుంబ సభ్యుల రాకతో సదరు యువకుడు మరో యువకుడితో కలిసి కారులో పరారయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని బొల్లెం చెరువు గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని తిమ్మాపూర్‌కు చెందిన బాలికను ఏడాదిగా వేధిస్తున్నాడు. సోమవారం ఉదయం బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఆశిరెడ్డిపల్లి శివారులో మరో యువకుడితో కారులో వచ్చిన సతీష్ బాలికను పెళ్లి చేసుకోవాలని, లేకపోతే చంపేస్తానంటూ కొట్టి, బెదిరించాడు. కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. బాలిక ఒక్కసారిగా కేకలు వేయడంతో అటువైపు వచ్చిన ఓ యువకుడు గమనించి బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా యువకుడు కారులో పరారయ్యాడు. ఈ సంఘటనపై బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

పంట పొలాలపై కోతుల దాడులు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- జనాలపై పెరుగుతున్న దాడులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



కమ్మరిపేటలో కోతుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

భీమారం, సెప్టెంబరు 23 : భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆయా పంట పొలాలపై కోతులు దాడులు పెరుగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటల్లో కోతులు దాడి చేయడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కొందరు రైతులు కోతుల బెడద కారణంగా చిరుధాన్యాలు, కూరగాయలు పండించడం మానివేస్తున్నారు. భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, దేశాయిపేట, గోవిందాం, పసునూరు, మన్నెగూడెం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని సైతం వరి గింజలు వలుచుకొని తినడంతో రైతులు అధికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కోతుల బెడద కారణంగా అన్నదాతలు చిరుధాన్యాలు, కూరగాయలు పండించడానికి కష్టాలు పడుతున్నారు. గత్యంతరంలేక వరిధాన్యం పండిస్తున్నారు.

జనాలపై పెరుగుతున్న దాడులు

గ్రామాల్లోని ఇళ్లల్లోకి కోతులు చొరబడి తినుబండారాలు, వివిధ వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. అడ్డు వచ్చిన జనాలపై తిరగబడి దాడి చేస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. అలాగే ఇళ్ల పైకప్పు పెంకులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారు. కిరాణ దుకాణ యాజమానులు దుకాణం ముందు గ్రిల్స్ రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒంటరిగా ఉన్న వృద్ధులు, చిన్నారులపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు అనేకం.

కోతుల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతి రోజు రైతులు తమ పంట పొలాలను కాపాడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ పొలాలను కాపాడుకోవడానికి విడతలవారీగా కాపలా కాస్తున్నారు. కొందరు రైతులు కుక్కలను వేలాది రూపాయలు వెచ్చించి తమ పంట పొలాల వద్ద కాపలాగా ఉంచుతున్నారు. మరికొందరు వానరాలను తరిమేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వందల ఎకరాల్లో జామ, మామిడి మొక్కలు ఉండేవి. కోతుల బెడద కారణంగా ఇవి ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయి. కోతుల నుంచి మమ్మల్ని కాపాడాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

చేనులో కాపలా కాస్తున్నాం..



మేము నలుగురం. మా మొక్కజొన్న చేనులో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా కాస్తున్నాం. ఎవరైనా భోజనం చేయడానికి ఇంటికి వెళ్తే కోతులు చొరబడి నష్టం కలుగజేస్తున్నాయి. ప్రభుత్వం మాకు సోలార్ ఫైల్డ్ ఫెన్సిల్ ఇప్పిస్తే మున్ముందు పంటలు వేస్తాం. లేదంటే వేయలేం.

- చెట్లపల్లి లింగారెడ్డి, రైతు

కోతుల బెడదతో మొక్కజొన్న వేయడం లేదు..



గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో మూడేళ్ల నుంచి మొక్క జొన్న పంట వేయడం లేదు. మూడు సంవత్సరాల క్రితం మొక్కజొన్న పంట వేస్తే ఒక్క సంచి కంకి కూడా ఇంటికి తీసుకుపోలేదు. ప్రభుత్వం కోతుల నుంచి రక్షణ కల్పించినట్లయితే మళ్లీ మొక్కజొన్న పంట వేస్తాను.

- చింతలపల్లి వెంకట రెడ్డి, రైతు, భీమారం

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒకరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. పాత గూడూరు గ్రామానికి చెందిన కొరవేని పెద్దిరాజు అతిగా మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

విద్యుత్ మోటార్ల చోరీ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుసగా విద్యుత్ మోటార్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరుసగా మూడు రోజులుగా ద్యాగల లక్ష్మీరాజం, ఎడమల సహదేవ్, బుయ్య కిషన్‌లకు చెందిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితులు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వీణవంకలో దొంగల హల్‌చల్

- రెండు దుకాణాల్లో చోరీ



ఐరన్ షాపులో ధ్వంసం చేసిన సీసీ కెమెరాలు

వీణవంక సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఎలక్ట్రికల్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాప్‌తో పాటు నల్ల పోచమ్మ షాప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. షట్టర్స్ పగులగొట్టి రెండు షాపుల్లో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఐరన్ షాపులో దాదాపు 14వేల రూపాయల నగదు చోరీ చేసి షాప్‌లోని పలు సామాన్లు ధ్వంసం చేశారు. నల్ల పోచమ్మ వైన్‌షాప్‌లో 35 వేల విలువైన మద్యం బాటిళ్లు చోరీ చేశారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకెళ్లారు. వైన్స్ షాప్ యజమాని దాసం రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తోట తిరుపతి తెలిపారు.

అడవి జంతువుల దాడిలో వరి పంట ధ్వంసం



అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

కేశవరావుపేట, సెప్టెంబరు 23 : కేశవరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామ శివారులో అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన మారుపాక లింగయ్య అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతు తెలిపాడు. అటవీశాఖ అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరుపోతుల అంజనేయులు(45) మృతి చెందాడని కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. అంజనేయులు దుర్శేడ్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఒక కారు అతివేగంగా ఢీకొనగా తల, ఇతరచోట్ల తీవ్ర గాయాలయ్యాయని, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతుడి కళ్ళను సోమవారం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది ఆంజనేయులు నేత్రాలను సేకరించి ఆసుపత్రికి తరలించారు.

కోరుట్లలో..

కోరుట్ల, సెప్టెంబరు 23 : పట్టణంలోని జీఎస్ గార్డెన్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన పెంట మక్కయ్య (47) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మక్కయ్య ఎసీకోని గుట్ట ప్రాంతం నుంచి కోరుట్లకు టీవీఎస్ ఎక్సెల్ (ఏపీ 15 ఎక్స్ 2518) నంబర్‌గల ద్విచక్ర వాహనంపై వస్తుండగా జీఎస్ గార్డెన్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో మక్కయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెర్కొన్నాడు.

భవన నిర్మాణ కార్మికుడి..

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 23 : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన బోమ్మ రవి(46) అను భవన నిర్మాణ కార్మికుడు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రవి భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18న మెట్‌పల్లి పట్టణంలో పనులు ముగిసించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మెట్ల చిట్టాపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కుక్కను ఢీకొని కింద పడ్డాడు. దీంతో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలపడంతో మెట్‌పల్లి ఆసపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందించినా ఫలితం లేక పోవడంతో ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో సోమవారం ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో మార్గ మధ్యలోనే మృతి చెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 14,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 14,170 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

30లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ (డిజైన్ టెక్నాలజీ) నాలుగో సెమిస్టర్ విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ నాలు గో తేదీ వరకు చెల్లించాలన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ.. యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 23 : మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన కూనారపు లక్ష్మణ్(36) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాల నుంచి లక్ష్మణ్ మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో తాగిన మత్తులో ఈనెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు లక్ష్మణ్ భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

● కాగా కూనారపు లక్ష్మణ్ గడ్డి మందు తాగడం వల్లనే మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు పురుగుల మందు దుకాణం ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకుని విరమింపజేశారు.

చెట్టుకు ఢీకొన్న బైక్..

సుల్తానాబాద్, సెప్టెంబర్ 23 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన శ్యామల రాజు, స్వరూప దంపతులు జీవనోపాధి కోసం పెద్దపల్లి వచ్చి స్థిరపడ్డారు. ఆదివారం వెదిరలో కుల సంఘం సమావేశం కోసం రాజు (30) తన ద్విచక్ర వాహనంపై వెదిర వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి పెద్దపల్లి వస్తున్నాడు. మార్గమధ్యలో సుల్తానాబాద్ బస్టాండ్ మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు రాజు భార్య స్వరూప సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 :కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఒకరు పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని చింతకుంట వాడకు చెందిన బొల్లారపు శివ ప్రసాద్ అనే వ్యక్తికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శివ ప్రసాద్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : అనారోగ్యంతో బాధపడుతూ మునిగాల శ్రీనివాస్(50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఒళ్లునొప్పులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న సిక్‌వాడిలో నివాసం ఉంటున్న ముని గాల శ్రీనివాస్ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- 200 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమామహేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు23 : దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలను ఇబ్రహీంపట్నం పోలీసులు 48 గంటలలో పట్టుకుని జైలుకు పంపారు. దొంగతనాలకు అలవాటు పడి దారి దోపిడీతో పాటు గంజాయి అమ్ముతున్న యువకులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న రాత్రి కమ్మర్‌పల్లి మండలంలో ఉప్లూర్ గ్రామానికి చెందిన సుధాగోని గంగాధర్‌గౌడ్ తన వ్యానులో ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తుండగా బండలింగపూర్ క్రాస్ రోడ్డువద్ద మూత్ర విసర్జన చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు గంగాధర్‌గౌడ్ వద్దకు వచ్చి దాడి చేసి తన వద్ద ఉన్న 5 వేల రూపాయలతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఇ బ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద అనుమానస్పదంగా బైక్‌పై వస్తున్న ముగ్గురిని ఆపి విచారించగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అలాగే బైక్‌లో తరలిస్తున్న 200 గ్రాములు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారిలో మేడిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠం వాడకు చెందిన బైండ్ల వేణు, బండలింపూర్ గ్రామానికి చెందిన కైర వేంకటేష్‌లను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి బైకు, డబ్బు, సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రి మాండ్‌కు తరలించినట్లు తెలిపారు.. నిందితులను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ కుమార్, కిరణ్ కుమార్‌లను సిబ్బంది గంగాధర్, చైతన్యలను మెట్‌పల్లి డీఎస్పీ అభినందించారు.

జనావాసాల్లోకి కొండచిలువ



బకెట్‌లో ఉన్న కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23 : ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని జనావాసాల్లోకి ఆదివారం రాత్రి కొండచిలువ రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. భారీ కొండచిలువను చూసి కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. ఓ యువకుడు 100 నంబర్‌కు డయల్ చేసి విషయాన్ని చెప్పాడు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు. సుమారు 2.30 గంటలపాటు శ్రమించి బకెట్ సహాయంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం హరిదాస్‌నగర్ శివారులోని అటవీ ప్రాంతంలో కొండచిలువను వదిలి పెట్టినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

భూవివాదాల్లో ఎస్ఐపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : భూ వివాదాల్లో తలదూర్చి డబ్బులు తీసుకుని పంచాయితీలు చేసేవాడని ఒక ఎస్ఐపై సోమవారం పోలీస్ కమిషనర్‌కు సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన భూ బాధితులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండల ఎస్ఐగా పనిచేసిన సమయంలో భూ దందాలపై డబ్బులు ఎక్కువ ఇచ్చిన వారికి మద్దతుగా ఉంటూ, నిజమైన భూ యజమానులకు అన్యాయం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటికి వచ్చి ఎస్ఐ బెదిరించినట్లు సీసీ కెమెరా ఆధారాలను కూడా సీపీకి అందజేశామని బాధితులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సంధ్య అనే మహిళ మానేరు జలాశయంలో టూరిస్ట్ బోట్‌లో టికెట్ తీసుకుని బోట్ రైడింగ్‌కు వెళ్లింది. బోట్ కొద్దిదూరం వరకు వెళ్లగానే వివాహిత ఒక్కసారిగా నీటిలోకి దూకింది. గమనించిన బోట్ డ్రైవర్, తోటి ప్రయాణికులు వెంటనే మహిళను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. సదరు మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏటీఎం దొంగల అరెస్టు



దొంగలు ఉపయోగించిన క్లిప్‌లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: ఏటీఎం మిషన్‌లో నగదు బయటకు వచ్చే చోట స్టీల్ ప్లేట్ లను అమర్చి ఖాతాదారులకు డబ్బులు కనిపించకుండా చేసి కొద్దిసేపటి తర్వాత ఆ డబ్బులను తీసుకుని మోసాలకు పాల్పడు తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాకు చెందిన ఇద్దరు నింది తులను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వ ర్యంలో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్ పాల్, సత్యవీర్ సింగ్ అనే ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హుజూరా బాద్‌కు చెందిన పేరుమల్ల భిక్షపతి ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని తారక్ హోటల్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో 10 వేల రూపాయలు డ్రా చేసేందుకు తన ఏటీఎం కార్డును పెట్టి పిన్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత డబ్బులు రాకపోయేసరికి అతను వెళ్ళిపోయాడు. అప్పటికే ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలో అనుమానాస్పదంగా కనిపించారు. ఆ తరువాత కొద్దిసేపటికి 10వేలు డ్రా అయినట్లుగా భిక్షపతికి మెస్సేజ్ వచ్చింది. అనుమానంతో బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అయితే భిక్షపతి ఏటీఎంలోకి వెళ్లక ముందు నుంచే నిందితులు ఏటీఎంలో అడ్డావేసి డబ్బులు వచ్చే మార్గంలో స్టీల్ క్లిప్‌ను అమర్చారు. కాని భిక్షపతికి ఆ డబ్బులు బయటకు కనిపించకపోవటంతో అతను కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. అక్కడే తచ్చాడుతున్న ఇద్దరు నేరస్థులు భిక్షపతి బయటకు వెళ్లిన తరువాత స్టీల్‌క్లిప్ సహాయంతో పదివేల రూపాయలను తీసుకొని పారిపోయారు. ఏటీఎంలో సీసీ కెమెరాల ఫుటేజీలు, ఇతర ఆధారాలతో నిందితులను పోలీసులు పట్టుకుని కటకటాల్లోకి పంపించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- నాడు తండ్రి, నేడు తల్లి మృతి
- అనాథలైన చిన్నారులు



ప్రహర్ష (ఫైల్)



అనాథలైన చిన్నారులు

మానకొండూర్, సెప్టెంబరు 23 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానకొండూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన కొండ్ర పవన్ కల్యాణ్ ఇదే గ్రామానికి చెందిన ప్రహర్ష ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె ఆద్యశ్రీ, కుమారుడు అయాన్స్‌లు జన్మించారు. కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకున్నారు. పది నెలల క్రితం పవన్ కల్యాణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ షోరూంలో ఉద్యోగం చేస్తూ కుమారుడు, కుమార్తెను స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఒకటవ తరగతి, నర్సరీ చదివిస్తోంది. సోమవారం ఉదయం పిల్లలను తయారు చేసి పాఠశాలకు పంపిన ప్రహర్ష బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మామ లక్ష్మయ్య వెళ్లి చూడగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. ప్రహర్ష బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్న సమాచారంతో గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకొని విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలను చూసి గ్రామస్థులు బోరున విలపించారు. మృతురాలి సోదరి ప్రసన్న ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షోరూంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఏమైనా జరిగిందా లేదా మృతికి కారణాలపై అనుమానాస్పద స్థితిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు. నాడు తండ్రి నేడు తల్లి మృతిచెందడంతో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలను చూసి బంధువులు, గ్రామస్థులు తీవ్రంగా విలపించారు.

సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, నాయకులు

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 23 : జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్లో తుమ్మేటి సమ్మిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ దివంగత నేత ఎమ్మెస్సార్ మనువడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌లతో కలిసి మంత్రి హాజరయ్యారు. సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, నాయకులు నివాళులు అర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఈ ప్రాంత రైతాంగం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి తుమ్మేటి అని కొనియాడారు. ఎమ్మెస్సార్ శిష్యుడిగా కాంగ్రెస్‌లో కొనసాగారని, అలాంటి వ్యక్తి ఆకస్మికంగా మరణించడం కాంగ్రెస్‌కు తీరని లోటు అన్నారు. అనంతరం మారుతినగర్‌లోని పిడుగు గట్టయ్య నివాసానికి వెళ్లారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

పత్తిలో రసంపీల్చే పురుగు నివారణపై అవగాహన

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23: మండలంలోని పెద్దలింగాపూర్ లో పత్తిలో రసంపీల్చే పురుగు నివారణపై ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, ఏఈఓ జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాపాలనను వక్రీకరిస్తున్న గతపాలకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో ప్రజాపాలనను గతపాలకులు వక్రీకరిస్తున్నారని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేరెళ్ల ఘటనలో గత ప్రభుత్వం బాధితులపైనే కేసులు పెట్టించిందని, చిత్రహింసలకు గురిచేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జిల్లాకు కేటీఆర్ వస్తున్నారంటే ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, నేరెళ్ల బాధితులను గృహనిర్బంధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్వాగతించాలన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు నేదూరి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గడ్డం కిరణ్, నాయకులు కొమ్ము రవి, బట్టు సురేందర్, వెంకటేష్, త్యాగరాజు, బొడ్డు రాజు, గడ్డం హనుమంతు, ఆకునూరి బాలకిషన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాదదాతి వినయం

గంభీరావుపేట, సెప్టెంబర్ 23 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యాదదాతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన కరీంనగర్ సన్‌షైన్ ప్రముఖ సర్జన్ డాక్టర్ టి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జీవితంలో స్థిరపడాలి అంటే విద్యతో పాటు వినయంను అలవర్చుకోవాలన్నారు. ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తింపు పొందటానికి అవసరమైన నైపుణ్యాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి పాక దర్మపురి, డాక్టర్ అంజనేయులు, శ్రవన్‌కుమార్, ఆదివిష్ణు, వాణి, బిక్షమయ్య, శ్రీనివాస్, మనోహర్, సుచరన్, కృష్ణప్రసాద్ తదితరుల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

రేషన్ డీలర్ల ఎంపికపె సమగ్ర విచారణ చేపట్టాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 23: రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల డివిజన్‌లోని 7 మండలాల్లో 58 చౌకాదారుల దుకాణాల డీలర్ల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే అభ్యర్థుల ఆరోపణలపై కలెక్టర్ స్పందించాలన్నారు. అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్, జిల్లా నాయకులు నాగరాజు, అనిల్, పడిగే మహేష్, దినకర్, అనిల్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 23: ఈ నెల 26వ తేదీన చిట్యాల ఐలమ్మ, 27వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉత్సవాల కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో చిట్యాల ఐలమ్మ 129వ జయంతి, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మార్వాడి సుదర్శన్, పంతం రవి, వికాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మహిపాల్ రెడ్డి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23 : మండలంలోని ఓబులాపూర్ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఉమ్మెంతల మహిపాల్‌రెడ్డి ఎన్నికయ్యాడు. సంఘ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పందుగు రాజిరెడ్డి, వికృతి లచ్చిరెడ్డి. ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి. కోశాధికారిగా పందుగు ఎల్లారెడ్డి. కార్యవర్గ సభ్యులుగా మడుపుఎల్లారెడ్డి, గుజ్జుల నరసింహారెడ్డి. పాశం నారాయణరెడ్డి. పల్లె సత్తిరెడ్డి. పందుగు ముత్యంరెడ్డి. గౌరవ అధ్యక్షులుగా పాశం ముత్యంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద రెడ్డి విద్యార్థులకు అండగా నిలుస్తానని తెలిపారు

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.22 టీఎంసీలకు చేరుకున్నాయి. మిడ్‌మానేరు ద్వారా వచ్చిన 3200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

వాలీబాల్ పోటీలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన పెద్దూరి రమ్య, పెద్దూరి స్రహన కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ క్రీడలో ప్రతిభను కనబర్చారు. ప్రథమ స్థానంలో నిలిచి సత్తాను చాటారు. జట్టుకు పెద్దూరి రమ్య కెప్టెన్‌గా వ్యవరించారు. రమ్య, స్రహన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీపీఎడ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడవులను పరిశీలించిన ఎఫ్ఆర్‌వో

కథలాపూర్, సెప్టెంబరు 23: మండలంలోని ఇప్పపల్లి - పోతారం అడవుల్లో యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్న వైనంపై ఈ నెల 22న 'సరిహద్దు వివాదం- ఎటూ తేల్చని రెవెన్యూ, అటవీ శాఖలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంకు అధికారులు స్పందించారు. మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి పద్మారావు, తహసీల్దార్ వినోద్, ఎస్సై నవీన్ కలిసి ధ్వంసమైన అడవులను పరిశీలించారు. నాలుగు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లు భూమి చదునుకు వినియోగించారని అధికారులు పలువురి నుంచి సమాచారం సేకరించారు. ఒక్క రోజు రాత్రి సుమారు పది ఎకరాల మేర అడవిని నరికివేసినట్టు

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 23 : ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల్లోని సమస్యలను పరిష్కరించాలని, జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని లేకుంటే ఆ అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి తరలివరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 167 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన పెండ్యాల మహేందర్ తనను మోసం ఆస్తి కాజేశాడని అతడిపై పైచర్యలు తీసుకోవాలని అవునూరు గ్రామానికి చెందిన బద్ది బాలవ్వ సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. అవునూరులో నివాసం ఉంటున్న తనకు 10 ఎకరాల భూములను ఇద్దరు బిడ్డలకు సమానంగా పంచుతానని నిర్ణయించగా కొండాపూర్‌కు చెందిన మహేందర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతోపాటు డబ్బులను తీసుకున్నాడని తెలిపారు.

బోయిన్‌పల్లి మండల కేంద్రం శివారులో సర్వేనంబర్ 28లో 5 ఎకరాల 10గుంటల వ్యవసాయ భూములు ఉండగా ధరణిలో మాపేరు మార్చిడి చేశారని గంగిపెల్లి శంకరవ్వ, గంగిపెల్లి పద్మ వినతి పత్రాన్ని అందజేశారు.

వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి మల్లయ్యకుంట చెరువును కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఇల్లంతకుంట మండలంలోని ఉమ్మడి గొల్లపల్లి నుంచి 2019లో నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన వెంకట్రావుపల్లె గ్రామానికి రెవెన్యూ సరిహద్దులతోపాటు నూతన జాబితాను సరిచేయాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

పక్షవాతంతో బాధపడుతున్నా.. వైద్యం అందించండి

పక్షవాతంతో బాధపడుతన్న తనకు మెరుగైన వైద్యం అందించాలని గంభీరావుపేట మండలం మాల్లారెడ్డిపేటకు చెందిన బైరగోని విజయ్‌కుమార్‌గౌడ్ వేడుకున్నాడు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించాడు. శరీరం సహకరించడం లేదని, మాటలు సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా జిల్లా వైద్యాధికారి వంసత్‌రావును అక్కడికి రప్పించి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. స్పందించిన జిల్లా వైద్యాధికారి కలెక్టరేట్‌కు 108ను రప్పించి వేములవాడ ఏరియా అసుపత్రికి తరలించారు.



ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్న దరఖాస్తుదారులు

మార్కెట్ కమిటీల నియామకంపై పునరాలోచించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : మార్కెట్ కమిటీల నియామకంపై కాంగ్రెస్ పెద్దలు పునరాలోచన చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని మండలాలలో మార్కెట్ కమిటీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో లేని సమయంలో అధికార పార్టీతో ఎదురైన కష్టాలను నష్టాలను భరించామని, పార్టీ వెన్నంటూ ఉన్నామని అన్నారు. నిన్నగాక మొన్న బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన వ్యక్తులకు నామినేటే పోస్టులు కట్టబెట్టడం కలచివేస్తోందన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన తమను గుర్తించ లేదన్నారు. మార్కెట్ కమిటీల కార్యవర్గాల నియామకాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నిమ్మల తిరుపతిగౌడ్, నాయకులు ఓరుగంటి నరసింహులు, చక్రబోయిన బాలయ్య, చీకోటి నర్సయ్య, మిద్దె సత్యం, ఎడబోయిన రాజు, పిట్ల నర్సింలు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

గంభీరావుపేట, సెప్టెంబరు 23: మంచినీటి సమస్య పరిష్కరించాలని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీవాసులు డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. డబుల్ బెడ్ ఇళ్లలో బోరు మోటారు కాలి పోయిందని, రెండు నెలలైనా పటించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. మిషన్ భగిరథ నీరు కూడా సరిగా రావడం లేదని, ఒక్కోసారి ఐదు రోజులకోసారి వస్తోందని వాపోయారు. మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. ఎంపీడీవో, మిషన్ భగీరథ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అక్కడికి చేరుకొని సముదాయించారు. అక్కడే సంబంధిత అధికారులతో హమీద్, హన్మండ్లు ఫోన్‌లో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

స్వచ్ఛత హీ సేవాకు సహకరించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : దేశ వ్యాప్తంగా ఈ నెల 17న ప్రారంభమైన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ప్రారంభించామని, సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫ సహత్ బేగ్‌అలీ అన్నారు. సోమవారం స్వచ్ఛత హీ సేవాలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మానేరు బ్రిడ్జి సమీపంలో వినాయక నిమజ్జనం చేసిన ప్రాంతంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థినులు శ్రమదానంతో కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ రెహనా, వైస్ ప్రిన్సిపాల్ అనూష, ప్రోగ్రాం ఆఫీసర్ వాణిశ్రీ పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

వీర్నపల్లి, సెప్టెంబరు 23: వీర్నపల్లి మండల కేంద్రంలోని వీర్నపల్లి-మద్దిమల్ల ప్రధాన రహదారి చౌరస్తాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కోసం సోమవారం నాయకులు భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ మాట్లాడుతూ చౌరస్తాకు సేవాలాల్ మహారాజ్ చౌరస్తాగా నామకరణం చేసినట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, గిరిజన నాయకులు సంతోష్ నాయక్, ప్రకాష్ నాయక్, శ్రీరామ్ నాయక్, విఠల్ నాయక్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటు వద్దు

వీర్నపల్లి, సెప్టెంబర్ 23 : ప్రభుత్వ స్థలాలు, ఆర్అండ్‌బీ రహదారులపై అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయరాదని ఎస్సై ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో అనుమతి లేకుండా ప్రధాన రహదారిపై సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన గిరిజన నాయకులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సంబంధిత అధికారులతో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. మండల ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

రుద్రంగి, సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు కరీంనగర్ జిల్లా పర్యటక శాఖ ఏఈ జీవన్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఆలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు సోమవారం పరిశీలించారు. ముందుగా లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ స్వామివారి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ మెట్లను సుందరీకరణ, రేకుల షెడ్డు, పిల్లల గార్డెన్, ఆటవస్తువులు, కల్యాణ మండపం, కమాన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. మాజీ జడ్పీటీసీగట్ల మీనయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, తర్రె లింగం, అభిలాష్, గుగ్గిళ్ల వెంకటేశం, స్వర్గం పరాంధామ్, దసారి గంగారాజం, మల్లయ్య, చెలుకల శ్రీకాంత్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం
సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడిగా చంద్రం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 23 : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడిగా దొంతుల చంద్రంను నియమిస్తూ సోమవారం సిరిసిల్లలో జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ ఉత్తర్వులను అందించి అభినందించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం సంఘం బలోపేతంకు కృషి చేయాలన్నారు. చంద్రం మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకంకు సహకరించిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తిపటేల్, జిల్లా అధ్యక్షడు బత్తుల మహేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తౌటం సత్యం, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుపెంట అజయ్‌పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: పాముకాటుకు గురై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ వసతి గృహం విద్యార్థి రమావత్ రోహిత్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా సమకూరిన రూ.59 వేల నగదును పాఠశాల హెచ్‌ఎం పావని, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మారుపాక అనిల్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. విద్యార్థి పాముకాటు గురైన విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు హరికృష్ణరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మారుపాక అనిల్ కలిసి విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం తమవంతు సాయం అందించాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దాతలు స్పందించి నగదును సమకూర్చారు. రూ.59 వేల నగదును చికిత్స పొందుతున్న విద్యార్థి రోహిత్ తల్లి రజితకు అందజేశారు. మానవత్వంతో స్పందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పావని, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మారుపాక అనిల్, ఉపాధ్యాయులు అయ్యన్నగారి హరికృష్ణరెడ్డి, తుంకుంట నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి వార్డెన్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల
మండల అధ్యక్షుడిగా అనిల్ కుమార్

కోనరావుపేట, సెప్టెంబరు 23 : కోనరావుపేట మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా అనిల్ కుమార్ ను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కవిత, కార్యదర్శిగా వేణు, జనరల్ సెక్రెటరీగా గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

సన్మాన సభకు కళాకారులు తరలిరావాలి

వేములవాడ టౌన్, సెప్టెంబరు 23 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సన్మాన సభకు కళాకారులు తరలిరావాలని కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ పోశెట్టి పిలుపునిచ్చారు. సోమవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన సికింద్రాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాబపూజీ హరిహర కళాభవన్‌లో సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బొజ్జ కనుకయ్య, తిరుమల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి, సెప్టెంబరు 23: తంగళ్లపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌కు పలు పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు శ్రీనివాస్ యాదవ్, రాజనర్సు, కాంగ్రెస్ నాయకుడు బైరి రమేష్, టీడీపీ నాయకుడు మచ్చ అంజనేయులు ఉన్నారు.

దశరథం అరెస్టును ఖండిస్తూ నిరసన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 23 : ఏఐఎఫ్టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథంను సోమవారం పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లో తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు బీ రవీందర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం కొత్త చెరువుకు సంబంధించిన నాళాలు, రొడ్డం కబ్జాలకు గురయ్యాయని దశరథం సోమవారం ధర్నాకు పిలుపునిస్తే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించడంను ఖండిస్తున్నామని అన్నారు. నాళాలు, రొడ్డం అక్రమాలపై అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. శాంతినగర్ ప్రజలతో కలసి ఆందోళనకు సిద్ధం కాగా నిర్బంధించి తాత్కాలికంగా పోలీసులు నిలవరించారని అయిన ఈ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రజెండా బీడీ కార్మిక సంఘం నాయకురాలు మచ్చ అనసూయ, నాయకులు ఎల్లయ్య, నారాయణ, దేవదాస్, పొండు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్ మెంట్ విడుదల చేయకుంటే మహాధర్నా

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 వరకు పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ విడదల చేయకుంటే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడతామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్న విద్యార్థుల సమస్యల పట్ల నోరు మెదపక పోవడం దురదృష్టకరన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్స్ రాకపోవడంతో కొన్ని ప్రైవేటు కళాశాలలో యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న అక్రమ్

వేములవాడ, సెప్టెంబరు 23 : ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మహ్మమద్ అక్రమ్ సోమవారం తన అనుచరులతో కలిసి ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అక్రమ్ తోపాటు పలువురికి ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీకి వ్యతిరేకంగా లోకసభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తూ కేంద్రంలో కాంగ్రెస్ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మనది సెక్యులర్ దేశమని, హిందూ ముస్లింలు సోదర భావంతో ఉంటారని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. వేములవాడ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీ ఖానా నిర్మాణం పూర్తి చేస్తానని, ఖబ్రస్థాన్ సమస్య పరిష్కరిస్తానని, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరు సుశిక్షితులైన సైనికులుగా పనిచేయాలన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారందరికీ తిరిగి పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గాలు వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు.సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 2019లో వేతనాల కోడ్‌ను 2020లో ఐఆర్ కోడ్‌ను, ఓఎస్ హెచ్‌కోడ్, సామాజిక భద్రత కోడ్‌ను బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిందన్నారు ఈ నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రెండుసార్లు దేశవ్యాప్త పోరాటాలు చేపట్టినా ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవడం లేదని మండిపడ్డారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో లేబర్ కోడ్ లను అమలు చేసేందుకు రూల్స్ తీసుకొచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 23 న బ్లాక్ డే పాటించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. సీఐటీయూ నాయకులు సత్యం, రవి, వేణు, రాజు, అడిచర్ల రాజు ఉన్నారు.

రేషన్ దుకాణాలను మాకే కేటాయించాలి



ధర్నా చేస్తున్న మాజీ రేషన్‌డీలర్లు



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 23 : తాము నిర్వహించిన రేషన్ దుకాణాలను తమకే కేటాయించాలని మాజీ రేషన్ డీలర్లు, డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ రేషన్ డీలర్లు మాట్లాడుతూ పదేళ్ల నుంచి రేషన్ దుకాణాలను నిర్వహిస్తున్నామని, ఇప్పుడు వేరే వారికి ఇవ్వడంతో ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. కలెక్టర్ స్పందించాలని, న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రేషన్ డీలర్లు పోన్నాల శ్రీనివాస్, చింతలపల్లి రాజిరెడ్డి, పుణ్‌నాయక్, దేవదాస్, రవీందర్‌రావు, పుల్లూరి లత తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలలో రేషన్ డీలర్‌ల కేటాయింపులో దివ్యాంగులకు అన్యాయం జరిగిందని దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందజేశారు. అనర్హులకు రేషన్ దుకాణాలను కేటాయించారని, కలెక్టర్ స్పందించి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు.